# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- జనగణన ప్రక్రియలో పౌరులందరూ భాగస్వామ్యం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ సరఫరా కొరతతో బంకుల మూతపడకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- విశాఖపట్నంలో రేపు జరగనున్న ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ఉప రాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.
- ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.

==================

జనగణన ప్రక్రియ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని ఇందులో పౌరుల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరు పాల్గొని జనగణన-2027 ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. “మన్ కీ బాత్” కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈరోజు మాట్లాడుతూ... 2027 జనాభా లెక్కల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గణన సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా ప్రజల వివరాలు నమోదు చేస్తారని చెప్పారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ పేరిట తమ సమాచారాన్ని స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కూడా ప్రజలకు ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని పూర్తిగా సురక్షితంగా.. గోప్యంగా ఉంచుతామని ప్రధాని హామీ ఇస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

విద్యార్థులకు పాఠశాలలు సెలవులను ప్రకటించాయని ఈ సమయంలో వారు తమ సెలవులను పూర్తిగా ఆస్వాదిస్తూనే.. కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రయత్నించాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. ఈ వేసవిలో ఎండాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ తమ ఆరోగ్యం పట్ల కూడా పూర్తి శ్రద్ధ వహించాలని సూచించారు.

(వాయిస్ 23 సెకన్లు)

==================

రాష్ట్రంలో కొన్ని చోట్ల పెట్రోల్, డీజిల్ సరఫరా కొరతతో బంకుల మూసివేయడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రవణ మాధ్యమం ద్వారా ఈరోజు సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో మొత్తం 4 వేల 510 అవుట్ లెట్స్ (పెట్రోల్ బంకులు) ఉండగా....పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా దాదాపు 421 బంకులు మూతపడ్డాయని తెలిపారు. సరఫరా గతంలో కంటే పెరిగినా... కొరత ఉందనే ఆందోళనతో అనవసరపు కొనుగోళ్లు భారీగా పెరిగాయని అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సుమారు 6 వేల 330 లీటర్ల పెట్రోల్ అమ్మకాలు ఉంటే... నిన్న ఒక్క రోజే 8 వేల 489 లీటర్ల అమ్మకాలు జరిగాయని చెప్పారు. ఇక డీజిల్ విషయంలో కూడా సాధారణ అమ్మకాల కంటే ఎక్కువ అమ్మకాలు జరిగాయని తెలిపారు. ఆక్వారైతులు డ్రమ్ముల్లో కొనుగోళ్లు జరుపుతారని.. వారికి పెట్రో ఉత్పత్తులు విక్రయించే విషయంలో సమస్య తలెత్తుతోందన్నారు. పరిష్కారం చూపేందుకు కలెక్టర్లు, ఫిషరీస్ శాఖ అధికారులు వెంటనే కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలపై తనకు నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

==================

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని.. సరఫరాలో వచ్చిన లోపాల వల్లే కొన్ని చోట్ల బంకులు మూతపడుతున్నాయని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఇంధన లభ్యతకు లోటు లేదని.. ప్రజాలేవరూ ఆందోళన చెందవల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రి నాదెండ్ల మనోహర్ చమురు కంపెనీలు, డీలర్లతో ఈరోజు దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సరఫరా విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, అధిగమించాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందన్నారు. సమాచార, ప్రసార మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు వివరాలు తెలపాలని అధికారులకు మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. పలు చోట్ల కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని.. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరా వ్యవస్థ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రైవేట్ ఆయిల్ కంపెనీల డిపోలు, అవుట్‌లెట్‌లను జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు.

విరామం

==================

అత్యంత అధునాతనమైన పరిజ్ఞానంతో లోవోల్టేజ్ సమస్య అధిగమించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని 14వ డివిజన్ బచ్చుపేట ప్రాంతంలో 6 కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సెమీ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీల పెంపుతో 32 వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ఛార్జీలు తగ్గించామన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి పెంచడం ద్వారా ప్రజలకు ఎటువంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు.

==================

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు నగరంలోని ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో రేపు జరగనున్నాయి. ఈ వేడుకులకు ఉప రాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

అదే విధంగా ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పూర్వ రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ఒడిశా గవర్నర్ ప్రొఫెసర్ కంభంపాటి హరిబాబు, కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ లు పాల్గొంటారు. ప్రత్యేక అతిథిగా దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ హాజరుకానున్నారు. 2025 ఏప్రిల్ 26న ప్రారంభమైన శతాబ్ది వేడుకల్లో భాగంగా వర్సిటీ యాజమాన్యం ఏడాది పొడువునా అనేక కార్యక్రమాలను నిర్వహించింది. రేపు సాయంత్రం జరగనున్న వేడుకలతో ఈ శతాబ్ది ఉత్సవాలు ముగియనున్నాయి.

=================

ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాలతో పాటూ గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటూ రాష్ట్రమంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, నారా లోకేశ్ లు ఉత్తరాంధ్రాలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేశ్ తో కలిసి ముఖ్యమంత్రి రేపు ఉదయం నగరానికి చేరుకుంటారు. 28వ తేదీ ఉదయం ఆనందపురం మండలం తర్లువాడలో జరిగే గూగుల్ డేటా సెంటర్ భూమి పూజలో పాల్గొంటారు. ఐటీ శాఖా మంత్రి అదే రోజు సాయంత్రం నోవాటెల్లో జరిగే “భారత్ ఏఐ శక్తి కాన్‌క్లేవ్” సదస్సులో పాల్గొంటారు.

=================

మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం శివరాంపురం గ్రామంలో నాబార్డ్ నిధులతో సుమారు 5 కోట్ల 95 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరో ఆరు నెలల్లోనే ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ వంతెన పూర్తయితే ఏటా వర్షాకాలంలో వాగులు పొంగిపొర్లడం వల్ల వచ్చే ఇబ్బందులు ఉండవని, విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు చేరుకుంటారని, రైతులు పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడం సులభతరమవుతుందని మంత్రి తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను కేవలం నగరాలకే పరిమితం చేయకుండా గ్రామ స్థాయికి చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.

=================

ఐపీఎల్-2026లో భాగంగా చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన చెన్నై.. 159 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ టైటాన్స్ కు నిర్దేశించింది. లక్ష్య చేధనకు దిగిన గుజరాత్ 6 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోకుండా 55 పరుగులు చేసింది.

=================
=================